# నీట్-2024ను మళ్లీ నిర్వహించాలి

- వైద్య విద్యార్థుల ధర్నా, నిరసన



జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న వైద్య విద్యార్థులు

జగిత్యాల, జూన్ 8: గత నెలలో నిర్వహించిన నీట్ -2024 పరీక్షను తిరిగి నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారూ మాట్లాడుతూ నీట్ చరిత్రలో ఇద్దరు, ముగ్గురు మినహా 60 మందికి పైగా ఆల్ ఇండియా స్థాయిలో మొదటి ర్యాంకు రావడం అనుమానాలకు తావిస్తున్నదన్నారు. దేశంలోని ఢిల్లీ, హర్యానా ప్రాంతాల్లో పేపర్ లీక్ అయ్యిందని ఆరోపణలు వచ్చాయని, వాటిపై ఎలాంటి విచారణ లేకపోవడం విచారకమన్నారు. నాలుగైదేండ్లు కోచింగ్ తీసుకునే విద్యార్థులకు సైతం ఇన్నేళ్లుగా రాని మొదటి ర్యాంక్‌లు ఇప్పుడెలా..? వచ్చాయో..? చెప్పాలని డిమాండ్ చేశారు. కటాఫ్, నెగిటివ్ మార్కులకు భిన్నంగా నీట్ ఫలితాలు ఉండడంపై ఆవేదన వ్యక్తం చేశారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడొద్దని, పరీక్ష నిర్వహణపై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, నీట్ 2024ను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు డాక్టర్ వినూత్నరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ముద్దం విజయ్, మహేశ్ రెడ్డి, బాలాజీ, శివ సాయి రెడ్డి, భాను ప్రకాశ్ ఉన్నారు.

## 10న సదరం కోసం స్లాట్ బుకింగ్

విద్యానగర్, జూన్ 8 : సదరం కోసం ఈ నెల 10న ఉదయం 11.30 గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్‌బుకింగ్ చేసుకోవచ్చునని కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖాన సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ అయిన వాళ్లు రసీదుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకుని రావాలని సూచించారు. వినికిడి, మూగ, చెవుడుకు 12న, కంటి చూపునకు 19న, మానసిక రోగులకు 24న, ఆర్థోకు 27న హాజరుకావాలని తెలిపారు.

# అయ్యో ఆడపిల్ల

## కడుపులోనే ఖతం

**కాసుల కక్కుర్తితో కొన్ని ప్రైవేట్ దవాఖానలు ఆడపిల్లలకు మరణశాసనం లిఖిస్తున్నాయి. కొడుకే కావాలనే తల్లిదండ్రుల ఆశలను క్యా(ష్)చ్ చేసుకొని.. అమ్మ కడుపులోనే సమాధి కడుతున్నాయి. ఇష్టారాజ్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి.. ఆపై పుట్టేది అమ్మాయి అయితే యథేచ్ఛగా అబార్షన్లు చేస్తున్నాయి. జిల్లా కేంద్రాలతోపాటు హుజూరాబాద్, జమ్మికుంటలోని కొన్ని హాస్పిటళ్లు అందుకు కేరాఫ్ అడ్రస్‌లా మారాయనే విమర్శలు వస్తున్నాయి. గతంలో అబార్షన్లు చేస్తున్నారంటూ ఏకంగా జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ దవాఖానను సీజ్ చేయగా, పదిహేను రోజుల క్రితం మెట్‌పల్లిలోని అంబేద్కర్ స్టేడియం వద్ద డ్రైనేజీలో ఓ శిశువు, హుజూరాబాద్ బస్టాండులో ఓ మూలన చెత్తకుప్పల్లో మరో ఆడశిశువు మృతదేహాలను పడేయడం భ్రూణహత్యలకు నిదర్శనంగా నిలుస్తున్నది. తనిఖీలు చేసి ఆటకట్టించాల్సిన వైద్య, ఆరోగ్య శాఖ యంత్రాంగం తీరు విమర్శలకు తావిస్తున్నది.**



- హుజూరాబాద్, జమ్మికుంటలో విచ్చలవిడిగా భ్రూణహత్యలు?
- పలు ప్రైవేట్ దవాఖానాల్లో దందా
- కాసులకు కక్కుర్తిపడి లింగనిర్ధారణ పరీక్షలు
- నిబంధనలు తొక్కిపెట్టి ఇబ్బడిముబ్బడిగా అబార్షన్లు
- పదిహేను రోజుల క్రితం హుజూరాబాద్, మెట్‌పల్లిలో శిశువుల మృతదేహాలు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్య శాఖ

హుజూరాబాద్, జూన్ 8 : లింగనిర్ధారణ పరీక్షలు 1970 నుంచి ప్రారంభమయ్యాయి. ఇవే ఆడపిల్లల పాలిట శాపంలా మారుతున్నాయి. నిజానికి ఈ పరీక్షలపై నిషేధమున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. కొందరు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు, పలువురు వైద్యులతో కలిసి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. గర్భంలో ఉన్న పిండం ఆరోగ్యంగా ఉందో? లేదో? తెలుసుకోవడానికి స్కానింగ్ చేయాల్సి ఉన్నా.. పరీక్ష ఫీజుకు తోడు అదనంగా కొంత మొత్తం చెల్లిస్తే చాలు పుట్టేది ఆడో, మగో చెప్పేస్తున్నారు. ఆ తర్వాత కూడా కొందరు భ్రూణహత్యలకు తెగబడుతున్నారు. జిల్లాకేంద్రాలతో పాటు ఇటీవలి కాలంలో హుజూరాబాద్, జమ్మికుంటలోని స్కానింగ్ సెంటర్లు, కొన్ని ప్రైవేట్ దవాఖానాల్లో గుట్టుగా లింగనిర్ధారణ చేస్తున్నట్టు తెలుస్తున్నది. మామూలుగానైతే స్కానింగ్ చేసేందుకు ₹రెండు వేల వరకు ఫీజు ఉండగా, లింగనిర్ధారణ (ఆడ, మగ) చెప్పేందుకు ₹5 వేలకు పైగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇక అబార్షన్‌కు అయితే ₹30 వేల నుంచి ₹40 వేల వరకు తీసుకుంటున్నారనే విమర్శలున్నాయి.

### జమ్మికుంటలో యథేచ్ఛగా?

'భ్రూణహత్యలు మహాపాపం' అని ప్రైవేట్ దవాఖానలు, స్కానింగ్‌కేంద్రాల వద్ద గోడలపై రాసి ఉంటుంది. అయితే, ఈ బోర్డులు కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నాయే తప్ప ఆలోచనలో మాత్రం మార్పు తేవడం లేదు. సంపాదనే పరమావధిగా పెట్టుకొన్న కొందరు వైద్యులు, సిబ్బంది తమ పంతాను వీడడం లేదు. గతంలో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో గుట్టుగా లింగనిర్ధారణ చేసి అబార్షన్లు చేస్తుండడంతో అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే ఆ దవాఖానను సీజ్ చేశారు. కానీ, కొన్ని రోజుల తర్వాత ఆ దవాఖాన మళ్లీ తెరుచుకున్నది. మళ్లీ కాసుల కోసం కక్కుర్తి పడుతున్నట్టు తెలుస్తున్నది. ఆ ఒక్క దవాఖాననే కాకుండా జమ్మికుంటలోని చాలా ప్రైవేట్ దవాఖానాల్లో ఈ తంతు నడుస్తున్నదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జమ్మికుంటలో యథేచ్ఛగా దందా నడుపుతున్న ఓ ప్రైవేట్ దవాఖాన ఇప్పుడు హుజూరాబాద్‌లో కూడా తమ దుకాణం తెరిచేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. జమ్మికుంటలోని ప్రైవేట్ దవాఖానాల్లో యథేచ్ఛగా అబార్షన్లు చేస్తుండడంతో కరీంనగర్ జిల్లాతో పాటు భూపాలపల్లి, పెద్దపల్లి, హనుమకొండ, తదితర జిల్లాల నుంచి ఇక్కడికి క్యూ కడుతున్నట్టు తెలుస్తున్నది.

### ఇవీ చట్టాలు

భారత ప్రభుత్వం 1971లో గర్భవిచ్ఛిత్తిపై (ఎంటీపీ ఆక్ట్), 1994లో ప్రసవ పూర్వక లింగనిర్ధారణ పరీక్షలపై (పీఎన్‌డీటీ ఆక్ట్) రెండు కీలక చట్టాలు చేసింది. 2003లో చట్టంలో పలు సవరణలు చేసి మరింత బలోపేతం చేసింది. లింగనిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించి పరీక్షలు చేస్తే మొదటిసారి మూడేళ్లవరకు జైలు శిక్ష, ₹10 వేల జరిమానా, రెండోసారి చేస్తే ఐదేళ్ల జైలు, ₹50 వేల జరిమానా విధించే అవకాశముంది. ఇక భ్రూణ హత్యలకు పాల్పడేవారికి మొదటిసారి మూడేళ్ల జైలు, ₹50 వేల జరిమానా, తిరిగి చేస్తే ఐదేళ్ల జైలు, ₹లక్ష జరిమానా విధించవచ్చు. అవసరమైతే లైసెన్సులనూ రద్దు చేయవచ్చు. కానీ, పరీక్షా కేంద్రాల ధనదాహం, అధికారుల నిర్లక్ష్యంతో జిల్లాలో విచ్చలవిడిగా భ్రూణహత్యలు సాగుతున్నాయి.

### నిబంధనలు గాలికి

రోగ నిర్ధారణ, గర్భిణులకైతే పిండం స్వరూపం తెలుసుకోవడానికి వైద్యుల సూచనల మేరకు స్కానింగ్ చేయాలి. పిండం ఎదుగుదల సక్రమంగా లేకపోయినా ఇతరత్రా కారణాలతో అబార్షన్ చేయాల్సి వస్తే పై అధికారుల అనుమతి తీసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏ రోజుకారోజు సంబంధించిన వివరాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపించాలి. స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ పరీక్షలను నిర్వహించరాదు. గర్భిణులకు కొన్ని రకాల పరీక్షలు చేసినా, లింగనిర్ధారణకు సంబంధించి వివరాలను ఇవ్వొద్దనే నిబంధన ఉంది. ఎప్పటికప్పుడు ఆయా సెంటర్లను అధికారులు తనిఖీ చేయాలి. ఇవేమీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తున్నది.

### అమ్మాయిల కొరత!

మొన్నటిదాకా 'ముగ్గురు వద్దు.. ఇద్దరు ముద్దు' అనుకున్నరు. ఇప్పుడు 'ఇద్దరు వద్దు.. ఒక్కరే ముద్దు' అనుకుంటున్నరు. ఇది బాగా నే ఉన్నది. కానీ, కొందరు ఆ ఒక్కరు కూడా వారసుడే కావాలనుకొని అమ్మాయిలను వద్దనుకుంటున్నారు. ఈ క్రమంలోనే లింగ నిర్ధారణ, అబార్షన్లు పెరిగి ఆడ పిల్లల సంఖ్య తగ్గుతున్నట్టు తెలుస్తున్నది. ఇటీవలి కాలంలో అయితే చాలా సామాజిక వర్గాల్లో యువతుల కొరత కనిపిస్తున్నది. ఎంత మంచి ఉద్యోగమున్నా, ఎంత డబ్బున్నా, ఎన్ని విద్యార్హతలున్నా ఆడపిల్ల దొరకడం గగనమే అవుతున్నది. ఎదురుకట్నం ఇచ్చినా దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా మేల్కోకపోతే అమ్మాయిల కొరత భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే ప్రమాదమున్నది.

### దవాఖానల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి



అడ్డదారుల్లో లింగ నిర్ధారణ, అబార్షన్లు చేస్తున్న వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వారి పట్టాను, స్కానింగ్, దవాఖానల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి. భ్రూణ హత్యలను అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించాలి. ఇటీవల హుజూరాబాద్ బస్టాండ్‌లో మూలన చెత్త కుప్పల్లో ఉన్న పసిగుడ్డు మృతదేహం సోషల్‌మీడియాలో కంటపడితే చాలా బాధేసింది. ఆడపిల్ల ఏ రంగంలోనైనా రాణిస్తుందనడానికి మన కండ్ల ముందే ఉన్నత స్థితిలో ఉన్న ఉద్యోగులు, రాజకీయంలో రాణిస్తున్న, వ్యాపారంలో మంచి పొజిషన్‌లో ఉన్న మహిళలే నిదర్శనం. ఇప్పటికైనా ఆడపిల్లలపై ఉన్న వివక్షను వీడాలి.

**- గందె రాధిక, మున్సిపల్ చైర్‌పర్సన్(హుజూరాబాద్)**

## మృగశిర.. చేపలకు ఫుల్ గిరాకీ



కరీంనగర్‌లో రాంనగర్ ఫిష్ మార్కెట్లో చేపలు కొంటున్న నగరవాసులు



*మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపలకు మస్తు గిరాకీ పెరిగింది. ఈ కార్తె మొదటి రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తుండడంతో చేపల మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. వ్యాపారులు మార్కెట్‌లో మాత్రమే కాకుండా చెరువులు, రోడ్ల వెంబడి విక్రయించడంతో జనం ఎగబడి కొనుగోలు చేశారు. దీంతో వ్యాపారులు ధరలు అమాంతం పెంచారు. రవ్వలు రూ.150 నుంచి రూ.200, బొమ్మె రకం రూ.600 వరకు విక్రయించారు.*

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

## తాగునీటి కోసం మహిళల నిరసన



కిషన్‌రావుపేటలో మంచి నీటి కోసం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న నేతకానీ పల్లే మహిళలు

వెల్గటూర్, జూన్ 8 : నాలుగు రోజుల నుంచి తమకు తాగునీరు రావడంలేదని మండలంలోని కిషన్‌రావుపేట గ్రామ పరిధిలోని నేతకానిపల్లె మహిళలు శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలు పట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్యను అధికారులకు చెప్తే ట్యాంకర్‌తో ఒక్కపూట మాత్రమే సరఫరా చేస్తున్నారని, అవి సరిపోవడం లేదని, వెంటనే మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈఘటనపై కార్యదర్శిని వివరణ కోరగా నాలుగు రోజుల నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, ఇప్పటికే అసలు సమస్యను గుర్తించేందుకు తమ సిబ్బంది పని చేస్తున్నారని, ఆదివారంలోగా సమస్యను పరిష్కరించి నీటిని అందిస్తామని సమాధానమిచ్చారు.

**రూ.2,080 తగ్గిన తులం ధర**
**హైదరాబాద్‌లో రూ.71,670**




# దిగొచ్చిన బంగారం

హైదరాబాద్, జూన్ 8: బంగారం కొండ దిగుతున్నది. గత మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి భారీగా దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా అతి విలువైన లోహాలు ధరలు ఒక్కసారిగా తగ్గడంతో దేశీయంగా ధరలు చౌకతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.2,080 తగ్గి రూ.71,670కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.73,750గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర రూ.1,900 తగ్గి రూ.67,600 నుంచి రూ.65,700గా నమోదైంది. అగ్రరాజ్యం అమెరికాలో నిరుద్యోగ గణాంకాలు తగ్గుముఖం పట్టడం, ద్రవ్యోల్బణ గణాంకాలు పుంజుకోవడంతో బంగారం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని బులియన్ వర్తకులు వెల్లడిస్తున్నారు. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గింది. దీంతో కిలో వెండి రూ.1,00,500 నుంచి రూ.96 వేలకు దిగొచ్చింది. అలాగే న్యూఢిల్లీలో తులం బంగారం రూ.2,080 దిగి రూ.71,820కి తగ్గింది. పసిడితోపాటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర శుక్రవారం ఒకరోజు 79.70 డాలర్లు తగ్గి 2,311.20 డాలర్లకు పడిపోయింది. అలాగే వెండి 2 డాలర్లు తగ్గి 29.27 డాలర్లుగా నమోదైంది.

# హోండా కార్లపై ప్రత్యేక ఆఫర్లు

## రూ.88 వేల వరకు రాయితీ ఇస్తున్న సంస్థ



న్యూఢిల్లీ, జూన్ 8: ప్రముఖ కార్ల తయారీ సంస్థ హోండా కూడా కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ప్రత్యేక ఆఫర్లను తెరపైకి తీసుకొచ్చింది. ఈ నెలలో నూతన వాహనాన్ని కొనుగోలు చేయాలనుకునేవారికి బంపర్ ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'హోండా సమ్మర్ బొనాంజా' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ కింద రూ.88 వేల వరకు రాయితీ ఇస్తున్నది. ఈ ఎక్స్‌క్లూజివ్ ఆఫర్‌లో ఒక జంట ప్యారిస్ లేదా రూ.75 వేల నగదును గెలుచుకునే అవకాశం కూడా సంస్థ కల్పించింది. ఈ నెల చివరి వరకు హోండా ఎలివేట్, హోండా సిటీ, సిటీ-ఈ: హెచ్ఈవీ, హోండా అమేజ్‌లను కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని పేర్కొంది. వీటిలో హోండా అమేజ్‌పై రూ.76 వేల ప్రయోజనాలు అందిస్తున్న సంస్థ.. సిటీపై రూ.88 వేలు, సిటీ ఈ:హెచ్‌ఈవీపై రూ.65 వేల వరకు, ఎలివేట్‌పై రూ.55 వేలు డిస్కౌంట్‌ను కల్పిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్లో మాట్లాడుతూ..కంపెనీ కార్లను కొనుగోలు చేసేవారికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సమ్మర్ బొనాంజా ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

# పెట్టుబడులకు డెల్టా ఎయిర్‌లైన్స్ సుముఖం

## కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశం

హైదరాబాద్, జూన్ 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అమెరికాకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ డెల్టా ఎయిర్‌లైన్స్ సుముఖత వ్యక్తం చేసినట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా శ్రీధర్ బాబు నేతృత్వంలో రాష్ట్ర బృందం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి అట్లాంటాలోని డెల్టా ఎయిర్‌లైన్స్ ప్రధాన కార్యాలయంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్, సీటీవో నారాయణన్ కృష్ణకుమార్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

### నేరుగా అట్లాంటాకు విమాన సేవలు...

హైదరాబాద్ నుంచి నేరుగా అట్లాంటాకు విమాన సర్వీసులు నడపడానికి డెల్టా ఎయిర్‌లైన్స్ సానుకూలంగా స్పందించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇరు నగరాల మధ్య విమాన సర్వీసులు లేకపోవడంతో విద్యాభ్యాసం కోసం వచ్చే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తున్నదన్నారు. దీనిపై కంపెనీ వర్గాలు సానుకూలంగా స్పందించాయి.

# అదానీ చేతికి కోల్‌కతా పోర్ట్

## ఓడరేవులపై పెరుగుతున్న గ్రూపు ఆధిపత్యం
## దేశ తీర ప్రాంతం దాదాపుగా హస్తగతం






న్యూఢిల్లీ, జూన్ 8: అదానీ గ్రూప్ గుప్పిట్లోకి దేశంలోని మరో పోర్టు వచ్చింది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఏపీ సెజ్) లిమిటెడ్.. కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు కంటైనర్ ఫెసిలిటీ కార్యకలాపాలు, నిర్వహణ కోసం ఐదేండ్ల కాంట్రాక్టును కుదుర్చుకున్నది. కాంపిటీటివ్ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఈ డీల్‌ను పొందినట్టు ఏపీసెజ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా, ఇప్పటికే దేశంలోని 13 పోర్టులు, టెర్మినల్స్ అదానీ గ్రూప్ ఆధ్వర్యంలో పనిచేస్తున్నవే కావడం గమనార్హం. వీటిలో 45 బెర్తులున్నాయి. ముంద్రాలోగల దేశీయ తొలి పోర్ట్ ఆధారిత సెజ్, తిరువనంతపురంలోగల తొలి డీప్ వాటర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్ కూడా అదానీ సొంతమే.

### ఏడు నెలల్లోగా..

లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ (ఎల్‌వోఏ) తేదీ నుంచి ఏడు నెలల్లోగా కోల్‌కతా కంటైనర్ ఫెసిలిటీలో కార్గో హ్యాండ్లింగ్ ఎక్విప్‌మెంట్‌ను అదానీ పోర్ట్స్ సంస్థ అందుబాటులోకి తేవాల్సి ఉన్నది. ఇక తమ నిర్వహణలో నేతాజీ సుభాష్ డాక్ వద్ద టెర్మినల్‌కు, కంటైనర్ పోర్ట్స్‌కు మధ్య కనెక్టివిటీ మెరుగవుతుందన్న ధీమాను ఏపీసెజ్ వ్యక్తం చేస్తున్నది. ముఖ్యంగా ఈ ఏడాది విజింజమ్, కొలంబోల్లో ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు కదులుతున్నట్టు చెప్తున్నది. 'దేశవ్యాప్తంగా ఆయా పోర్టులు, లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో మాకున్న చిత్తశుద్ధి, అంకితభావం వల్లే నేతాజీ సుభాష్ డాక్ కాంట్రాక్టును కూడా దక్కించుకోగలిగాం' అని ఏపీసెజ్ సీఈవో అశ్వినీ గుప్తా అన్నారు. దేశ, విదేశాల్లోని వివిధ కంటైనర్ టెర్మినల్స్ నిర్వహణలో తమ సంస్థకున్న రెండు దశాబ్దాలకుపైగా అనుభవం పశ్చిమ బెంగాల్ ప్రజలకు, కస్టమర్లకు ప్రయోజనకరంగా మారుతున్నదని కూడా చెప్పారు.

### తూర్పు తీరంలో..

భారత తూర్పు తీరంలో కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ డాక్.. అతిపెద్ద కంటైనర్ టెర్మినల్‌గా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇక్కడ దాదాపు 0.63 మిలియన్ టీఈయూ (20 అడుగులకు సమానమైన యూనిట్) హ్యాండ్లింగ్ జరిగింది. పశ్చిమ బెంగాల్‌తోపాటు బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పాటు నేపాల్, భూటాన్‌లకు సేవలు అందాయి. ఈ డాక్‌కు సింగపూర్, పోర్ట్ కెలాంగ్, కొలంబో పోర్ట్ హబ్‌ల నుంచి రెగ్యులర్ లైన్ సర్వీస్ కాల్స్ కూడా ఉన్నాయి.

### మోదీ హయాంలోనే..

మోదీ హయాంలోనే అదానీ గ్రూప్ అన్ని రంగాల్లో వేగంగా విస్తరించుకుంటూ పోయింది. ముఖ్యంగా దేశంలోని దాదాపు అన్ని ఓడరేవులు, కీలక విమానాశ్రయాలు ఇప్పుడు గౌతమ్ అదానీ కనుసన్నల్లోనే ఉన్నాయంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. వడ్డించేవాడు మనవాడైనప్పుడు బంతిలో ఏ మూలన కూర్చున్నా విందు భోజనమే. దీనికి తగ్గట్టుగానే గత పదేండ్లుగా కేంద్రంలో బీజేపీ సర్కారు అధికారంలో ఉన్న నేపథ్యంలో బిడ్డింగ్‌లో పాల్గొంటే చాలు ఆ కాంట్రాక్టు అదానీదే అన్నట్టు తయారవుతున్నది పరిస్థితి. గుజరాత్ (4), ఆంధ్రప్రదేశ్ (2), తమిళనాడు (2), గోవా (1), మహారాష్ట్ర (1), కేరళ (1), పుదుచ్చేరి (1), ఒడిషా (1)ల్లో అదానీకి పోర్టులున్నాయి. ఇప్పుడు పశ్చిమ బెంగాల్ సైతం ఈ లిస్టులో చేరింది. శ్రీలంక, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్‌లోనూ ఉన్నాయి.

## వాణిజ్య

### ఎల్‌జీ 64 ఇంచుల ఓఎల్‌ఈడీ టెలివిజన్

*ధర రూ.1.80 లక్షలు*

హైదరాబాద్, జూన్ 8: దేశీయ మార్కెట్లోకి సరికొత్త టీవీను అందుబాటులోకి తీసుకొచ్చింది ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా. నూతన టెక్నాలజీ కోరుకుంటున్న వారిని దృష్టిలో పెట్టుకొని 64 అంగుళాల ఓఎల్‌ఈడీ సీ4 కృత్రిమ మేధస్సు టీవీను హైదరాబాద్‌లో విడుదల చేసింది. ఈ టీవీ ప్రారంభ ధర రూ.1,79,999గా నిర్ణయించింది.

### నేషనల్ మార్ట్ మరో ఔట్‌లెట్

హైదరాబాద్, జూన్ 8: రిటైల్ ఔట్‌లెట్ సంస్థ నేషనల్ మార్ట్.. హైదరాబాద్‌లో మరో అవుట్‌లెట్‌ను ఏర్పాటుచేసింది. సంస్థకు ఇది ఏడో ఔట్‌లెట్ కావడం విశేషం. మెహదీపట్నంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను ఏఐఎంఐఎం ప్రెసిడెంట్ అసదుద్దీన్ ఓవైసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్ యశ్ అగర్వాల్ మాట్లాడుతూ..అతి తక్కువ ధరకే నాణ్యమైన అన్ని రకాల ఉత్పత్తులను అందించడం వల్లనే కస్టమర్లను ఆకట్టుకోగలుగుతుంది.



## నయా చేతక్ ఈ-స్కూటర్

### సింగిల్ చార్జింగ్‌తో 123 కి.మీ.

న్యూఢిల్లీ, జూన్ 8:మార్కెట్లోకి నయా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది బజాజ్ ఆటో. చేతక్ 2901 పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ ధర రూ.95,998గా నిర్ణయించింది. ఈ ధరలు బెంగళూరు షోరూంనకు సంబంధించినవి. ఐదు రంగుల్లో లభించనున్న ఈ నయా మాడల్ అడ్వాన్స్ టెక్నాలజీతో తీర్చిదిద్దింది. సింగిల్ చార్జింగ్‌తో 123 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ సులువుగా ఎత్తైన గుట్టలు ఎక్కనున్నది. ఈవీ పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ఈ నయా మాడల్‌ను తీర్చిదిద్దింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న పెట్రోల్ స్కూటర్ ధర స్థాయిలోనే ఈ స్కూటర్ ధర ఉన్నదని, ఈ నెల 15 నుంచి విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# ఆయనొక మార్గదర్శి

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : వ్యాపార రంగానికి ఆయనొక మార్గదర్శి. ఏ పనైనా దూరదృష్టితో ప్రణాళికవేస్తే విజయం సాధిస్తామన్న ధీమా ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావుకు పుట్టుకతోనే వచ్చింది. తాను మొదలు పెట్టే ఏ కార్యక్రమమైనా తాత్కాలికంగా కాకుండా.. దీర్ఘకాలికంగా నిలువాలనే ఉద్దేశంతో అడుగులు వేశారు. కృషి, పట్టుదలతో విజయవంతంగా ముగించాలని భావిస్తుంటారు కాబట్టే ఆయన చేపట్టినదేదైనా బంగారమైంది. శూన్యం నుంచి చరిత్రను లిఖించగలిగిన వ్యక్తిగా ఎదిగారంటే కారణం ఆయన క్రమశిక్షణే. అందుకే ఆయనొక వ్యాపార మార్గదర్శిగా నిలిచారు.

### ఢిల్లీలోనే వ్యాపార బీజాలు..

గుడివాడలో ఇంటర్మీడియట్ చదివిన తర్వాత తొలి ఉద్యోగం దేశ రాజధాని ఢిల్లీలో చేశారు. 'అనంత్' అనే మలయాళీ స్థాపించిన ఒక యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్ట్‌గా చేరారు. అక్కడ తన డెడికేషన్ చూసి ఆ యజమాని ఉప్పొంగిపోయేవారు. అప్పుడే గొప్ప విజయాలు సాధించవచ్చన్న ఆత్మవిశ్వాసం ఆయనలో పెరిగింది. వచ్చిన అమెరికా అవకాశాన్ని కుటుంబం కోసం వదులుకొని.. 1962 అక్టోబర్‌లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. చిట్టీల వ్యాపారమంటే గృహిణుల వ్యవహారమన్న రోజుల్లోనే మార్గదర్శిని ఓ మార్గదర్శకంగా తీర్చిదిద్దారు. వసూళ్లు, చెల్లింపులు కచ్చితంగా ఉండటంతో ఖాతాదారుల్లో విశ్వాసం ఏర్పడింది. సిబ్బంది క్రమశిక్షణ, అంకితభావం, యాజమాన్య విశ్వసనీయత కారణంగా సంస్థ వేగంగా అభివృద్ధి చెందింది.

### ఆతిథ్య రంగంలోనూ... హవా

సాగర తీర సుందర పట్టణం విశాఖలో డాల్ఫిన్ హోటల్‌ను 1980లో ప్రారంభించారు. విశాఖ పెద్ద పర్యాటక నగరంగా అభివృద్ధి చెందుతుందని ముందస్తు అంచనాతో ఆయన.. త్రీస్టార్ హోటల్‌గా దీనిని ప్రారంభించారు. ఇదే క్రమంలో ఆతిథ్య రంగానికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రామోజీ ఫిల్మ్ సిటీలోనే తార, సితార స్టార్ హోటళ్లను నిర్మించారు. సహారా, శాంతినికేతన్‌లు దీని ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

### ప్రియా పచ్చళ్లకు డిమాండ్..

తెలుగువారి వంటింటి రుచుల్ని ప్రపంచానికి అందించాలనే ఉద్దేశంతో రామోజీరావు 1980లో ప్రియా పచ్చళ్ల వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. కృష్ణా జిల్లా పోరంకి గ్రామంలో ఆరు రకాల ఊరగాయలతో ప్రారంభమైన ఈ వ్యాపారం ప్రస్తుతం 205 రకాల ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా విక్రయిస్తున్నది.

### సాంస్కృతిక వైభవం 'కళాంజలి'

హస్తకళలు, వస్త్ర సోయగాలకు వేదికగా నిలిపేందుకు ఆయన కళాంజలిని 1992లో ప్రారంభించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఇనుమడింపజేసే చేతివృత్తి కళాకారులను ప్రోత్సహిస్తూ హైదరాబాద్‌లో ప్రారంభమై... విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రముఖ నగరాలకు షోరూంలను విస్తరించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, అస్సాం, కేరళతోపాటు దేశవ్యాప్తంగా విస్తరించారు.

### రామోజీ ఫిలిం సిటీకి గుర్తింపు

హైదరాబాద్ వేదికగా 1996లో రామోజీ ఫిలిం సిటీ ఆరంభమైంది. సాధారణ చిన్న సినిమాలతోపాటు, హాలీవుడ్ చిత్రాలు సైతం ఈ ఫిలిం సిటీలో షూటింగ్‌లు జరుపుకుంటున్నాయి. బిగ్గెస్ట్ ఫిలిం ప్రొడక్షన్ సెంటర్‌గా ఈ ఫిలిం సిటీని గిన్నిస్ రికార్డు సైతం వరించింది.



### ప్రారంభించిన వ్యాపారాలు

- **ప్రకటనల వ్యాపారం కోసం 1965లో కిరణ్ యాడ్స్ పేరుతో ప్రత్యేకంగా సంస్థను ప్రారంభించారు.**
- **1967-69 మధ్యకాలంలో ఖమ్మం వేదికగా వసుంధర ఫర్టిలైజర్స్ పేరుతో ఎరువుల వ్యాపారాన్ని నిర్వహించారు. ఆ తర్వాత అన్నదాత పత్రికను ప్రారంభించడంతో ఈ వ్యాపారానికి స్వస్తి పలికారు.**
- **ప్రస్తుతం 16 భారతీయ భాషల్లో ఈటీవీ చానెళ్లను నిర్వహిస్తున్నారు.**